క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి


గ్రామంలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

కొడంగల్: అనుబంధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి ఐనన్‌పల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. చేతి పంపులు, బోరు మోటార్లను పరిశీలించారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక


శిరీషకు పార్టీ కండువా కప్పుతున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: కోస్గి మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ మ్యాకల శిరీష దంపతులు, కో ఆప్షన్ సభ్యుడు గందె ఓం ప్రకాశ్‌లు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హస్తం కండువా కప్పి ఆహ్వానించారు.

నియామకం


కమిటీ సభ్యులతో మండల అధ్యక్షుడు

పరిగి: దివ్యాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు చంద్రయ్య అన్నారు. గురువారం మండల పరిధి మిట్టకోడూర్, రావులపల్లిలో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులను అర్హులకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఎవరికి ఏ సాయం కావాలన్నా, సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దివ్యాంగులు ఐకమత్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలుంటుందని వెల్లడించారు. అందుకే గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

కోర్టు భవనానికి స్థలం కేటాయించాలి


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

అనంతగిరి: నూతన కోర్టు భవన నిర్మాణానికి మున్సిపల్ పరిధి ఎన్నెపల్లిలోని హార్టికల్చర్‌కు సంబంధించిన భూమిలోంచి 15 ఎకరాలను కేటాయించాలని వికారాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరావు, శంకరయ్య, సంపూర్ణానంద్, బాలయ్య, పరశురాం నాయక్, రవీందర్, రాజు, నర్సింలు, అనిల్, సాయిరాం, సంజీవ్, శేఖర్ ఉన్నారు.

నిమ్మకాయ @ 8



దౌల్తాబాద్: ఎండలతో పాటే నిమ్మకాయ ధర పోటీ పడుతోంది. 20 రోజుల క్రితం రూ.10కి నాలుగు లభించే కాయలు, భానుడి భగభగలకు వాడకం రెట్టింపై.. ధర అంతకంతకు పెరిగి ఒక కాయ రూ.8 పలుకుతోంది. ఇదిలా ఉండగా.. ఈ సారి దిగుబడి తగ్గి రవాణా ఛార్జీలు పెరిగాయి. ఫలితంగా నిమ్మ ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఒక్కో చెట్టుకు ఐదు నుంచి ఆరు బస్తాల నిమ్మ దిగుబడి రాగా.. మారిన వాతావరణ పరిస్థితులు, చీడపీడల వలన కాత, పూత లేక దిగుబడి అనూహ్యంగా పడిపోయింది. దీంతో నిమ్మ ధరలు పెరిగి, వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతీ ఓటరును కలవాలి

కొందుర్గు: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రతీ ఓటరును కలవాలని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు సూచించారు. గురువారం చౌదరిగూడలో కాంగ్రెస్ ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పేదలకు న్యాయం జరిగిందని, ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయ భూములు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

ఆహ్లాదం.. బహుదూరం


గుముడాలకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన వనం

- పల్లెలకు దూరంగా పల్లెప్రకృతి వనాలు
- వెళ్లేందుకు ఆసక్తి చూపని ప్రజలు

దౌల్తాబాద్: ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వం పల్లెపల్లెకు పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. తీరిక సమయంలో సేదతీరేందుకు ప్రజలు వచ్చేవారు. పచ్చదనాన్ని ఆస్వాదించేవారు. కానీ మండల పరిధి పలు ప్రాంతాల్లో గ్రామాలకు దూరంగా ఉండటంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. సందర్శకుల తాకిడి లేకపోవడంతో.. నిర్వహణలోపం ఏర్పడింది. ఫలితంగా మొక్కలు ఎండిపోతున్నాయి.

వినియోగంలోకి తెస్తాం

స్థలం కొరతతో పలు గ్రామాల్లో నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేశాం. భూమి అందుబాటులో ఉన్న పల్లెల్లో ఊరికి చేరువనే వనాలను తీర్చిదిద్దాం. దూరంగా ఉన్నవాటిని ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

తక్కువ విస్తీర్ణంలో..

గ్రామానికి ఒకటి చొప్పున మండల పరిధి 33 జీపీలకు వనాలను ఏర్పాటు చేశారు. కనీసం ఎకరం స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. తక్కువ విస్తీర్ణంలోనే చేపట్టారు. మొదట్లో మొక్కలకు నిత్యం పంచాయతీ సిబ్బంది నీటిని పట్టేవారు. ఇప్పుడు వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడంలేదు. గుముడాల గ్రామానికి చెందిన వనం.. నివాసాలకు 6కిలో మీటర్ల దూరంలో ఉంది. దేశాయిపల్లిలో మూడు కిలోమీటర్ల దూరం కొడీడ్ గ్రామ సమీపాన ఏర్పాటు చేశారు. అంతారంలో వైకుంఠధామం పక్కన వనాలను తీర్చిదిద్దారు. కేవలం దౌల్తాబాద్, కుదురుమళ్లలోనే గ్రామం నడిబొడ్డున ఏర్పాటు చేయడంతో ప్రజలకు చేరువయింది.

ప్యాకేజీ లీడర్స్!



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరమైన అంశాలు చోటుచేసుకుంటున్నాయి. 'మాకు ఓటు బ్యాంకు ఉంది. మేం ఎంత చెబితే అంత' అంటూ ప్యాకేజీ ఇస్తే పార్టీ మారేందుకు కొందరు సిద్ధంగా ఉండగా.. మరి కొందరు తమ పనులు చేయించుకోవచ్చనే ఉద్దేశంతో అధికార పార్టీవైపు చూస్తున్నారు. ఇలా ఏ ఎండకు ఆ గొడుగు పడుతున్న జంప్ జిలానీలు అన్ని పార్టీలకు తలనొప్పిగా మారుతున్నారు.

- అభిమానం అంటూనే బేరసారాలు
- డీల్ కుదిరితే కండువా మార్పు
- జంప్ జిలానీలతో అన్ని పార్టీలకు దడ

ధారూరు: ఎన్నికలు అంటేనే కొందరికి కలెక్షన్ల పండుగ. పోటీ దారులు నువ్వానేనా అన్నట్లు ఉంటే అన్ని వైపుల నుంచి డబ్బేడబ్బు. అది ఇస్తున్నారంటే పార్టీ మారి జేబులు నింపుకోవడం నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుతం బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలు మారడంలో ముందు వరుసలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఎవరు బయటకు వెళ్లకున్నా.. ఇతర పార్టీల నుంచి వలసలకు గేట్లు తెరిచింది.

బలాబలాల నిరూపణకు బేరం

జిల్లాలోని ధారూరు మండలం నుంచి మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పార్టీలు మారడంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. హస్తం, కమలం పార్టీల్లో ఆర్థికంగా బలమైన ఎంపీ అభ్యర్థులు ఉండటంతో వారికి చేరువయ్యేందుకు మక్కువ చూపుతున్నారు. దీనికి కారణం ఓటుకు నోటు తప్పకుండా వస్తుందనే ఆశ.. వీరిని కప్పగంతులు వేయిస్తున్నట్లు సమాచారం. ఇక నాయకుల విషయానికి వస్తే చేరికల కోసం బేరసారాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం కొందరు ఎంపీ అభ్యర్థుల నుంచి రూ.వేలు, లక్షలు దండుకుంటున్నారని, బలాబలాలు నిరూపించుకోవడానికి ఆ జాతీయ పార్టీలకు కాసులు కురిపించక తప్పడం లేదని.. ఆ గూటి పక్షులే బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ఎంత డబ్బు అయినా వెదజల్లి ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్‌ఎస్ నాయకులను తమవైపు తిప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పకనే చెబుతున్నారు.

ఓటు బ్యాంకు నేతలకు గాలం

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు రాష్ట్రంలో అధికారంలో హస్తం పార్టీలో ప్రాంత పార్టీలోంచి వలసలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా కమలం గూటికి. గుండుగుత్త ప్యాకేజీ ప్రకటించి మాజీ ప్రజాప్రతినిధులకు గాలం వేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కావడం, బీజేపీ అభ్యర్థి సైతం చేవెళ్ల నియోజకవర్గం నేత కావడంతో నాయకులను చేర్చుకోవడంలో ఇరు పార్టీల మధ్య పోటీ పెరిగింది. ఈ ఎన్నికలో ప్రతీ ఓటు కీలకం కావడంతో వచ్చేవారికి ఎంతోకొంత ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తోంది. అనంతరం చేర్చుకున్న పలుకుబడి ఉన్న నాయకులకు ఏ మేరకు ఓటు బ్యాంకు ఉందనే అంచనాలు వేస్తున్నాయి.

అభిమానంతో వస్తున్న సార్..

'సార్ మీపైన అభిమానంతో పార్టీ మారుతున్న. మాది ఫలాన కులం. ఫలానా యువజన సంఘం నేతను. నా వద్ద ఎక్కువ మొత్తంలో ఓట్లు ఉన్నాయి. మా వాళ్లకు నేను ఎంత చెబితే అంత. ఎవరికి ఓటెయ్యాలంటే వారికే వేస్తారు' అని బేరానికి దిగడం జిల్లాలో కామన్ అయింది. ఇక అధికార పార్టీలోకి జంప్ అవుతున్న నాయకులు.. ఎలాంటి షరతులు విధించడం లేదు. ఎందుకంటే కాంగ్రెస్‌లో చేరితే ముందు కావాల్సిన పనులను చక్కబెట్టుకోవచ్చుననే ఆశతో ముందుకు సాగుతున్నారు.

కూలీలందరికీ పని కల్పించండి

ఎంపీడీఓ రాములు


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద తప్పనిసరిగా పని కల్పించాలని ఎంపీడీఓ రాములు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలో సుమారు 5,200 మంది కూలీలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, వీరందరూ వంద రోజులు పని చేసేలా చూడాలని చెప్పారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు తాగు నీటి వసతిని కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కూలీలకు వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈజీఎస్ సిబ్బందికి చెప్పారు. సకాలంలో కూలీ డబ్బులు అందేలా చూడాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నీటి వృథాను అరికట్టాలని, ఎక్కడైనా పైప్‌లైన్‌లు లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్ కుమార్, జేఏ షఫీ, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, టీఏలు అశోక్‌రెడ్డి, జంగయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాటక బృందానికి ఆర్థిక సాయం

యాలాల: శివధలంధరుడు నాటక బృందానికి మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ నగదును సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, మాజీ సర్పంచ్ రవికుమార్‌గౌడ్ చేతుల మీదుగా బుధవారం రాత్రి గోరేపల్లిలో నాటక నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు రోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, పటేల్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణకుమార్, రవీందర్‌రెడ్డి, విక్రాంత్, శివప్ప, శంకర్‌గౌడ్, మధుగౌడ్, సందప్ప, సతీష్ ఉన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

తాండూరు: భానుడి ప్రతాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 10 మండలాలు ఆరెంజ్ అలర్ట్‌లో ఉండగా, మిగతా మండలాలు ఎల్లో అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

23న సర్వసభ్య సమావేశం

బంట్వారం: ఈ నెల 23న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షకు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ధారూరులో.. చిరుజల్లులు

ధారూరు: మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్న ప్రజలకు.. ఉన్నట్టుండి కురిసిన చిరుజల్లులతో మరింత ఉక్కపోత మిగిల్చింది. ధారూరు మండల పరిధి గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఆ తరువాత ఎండ తీవ్రత పెరిగి భరించలేని వేడితో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఫ్యాన్లు, ఏసీలు ఎంత పనిచేసినా.. ఉపశమనం లభించలేదని స్థానికులు తెలిపారు. మరింత వర్షం పడితే.. వాతావరణం చల్లబడుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.


వీధుల్లో కురుస్తున్న వాన

సంస్థ సేవలు అభినందనీయం

పూడూరు: గ్రామాలను స్వచ్ఛంద సంస్థలు దత్తతకు తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ సర్పంచ్ పోతర్ల కవిత అన్నారు. గురువారం మండల పరిధి సిరిగాయపల్లిని హైదరాబాద్‌లోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. సైబేజ్ ఆశా కార్యక్రమం ద్వారా రూ.10 లక్షల వ్యయంతో పంచాయతీలో సీసీ రోడ్డు పనులు చేపట్టారని తెలిపారు. సీసీతో పాటు పాఠశాలలో పలు అభివృద్ధి పనులు, గతంలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. అవసరం ఉన్న చోట మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ప్రశాంత్ మహముని, సీనియర్ ఎక్జిక్యూటివ్ అనపురపు సురేష్, నాయకులు సీతారాంరెడ్డి, వెంకటదాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

బంట్వారం: మండల పరిధి బస్వాపూర్ గ్రామంలో గురువారం తెల్లవారు జామున ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా రెండు రోజుల పాటు స్వామివారి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. మొదటి రోజు సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. సాయంత్రం పెరుగు బసంతం పూర్తి చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే

పూడూరు: మండల పరిధి తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రత్లావత్ శాంతిబాయి, కిషన్‌నాయక్ కూతురు వివాహ వేడుకలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య రూ.11 వేల నగదును ఆర్థిక సహాయంగా యువతి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, రాములునాయక్, గోపాల్‌నాయక్, పరశురాం పాల్గొన్నారు.


వధూవరులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరి

చేవెళ్ల అగ్నిమాపక కేంద్రం అధికారి భిక్షపతి

చేవెళ్ల: కంపెనీలలో తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ఫైర్‌సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని చేవెళ్ల ఫైర్‌స్టేషన్ అధికారి భిక్షపతి యాజమనులకు సూచించారు. మండలంలోని అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెట్రోల్ బంక్‌లు, కంపెనీల వద్ద జరిగే అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించటంతో పాటు వాటిని చేసి చూపించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాటిని నివారించేందుకు తగిన పనిముట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. భారీ ప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన పోస్టర్లు, కరప్రతాలను కంపెనీలోని కార్మికులకు, సిబ్బందికి, ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది దుర్గాదాస్, ఖాజా, ప్రశాంత్‌కుమార్, సురేందర్, గోపాల్, శివుడు, కంపెనీ ప్రతినిధులు, కార్మికులు తదితరులు ఉన్నారు.


చేవెళ్లలో అనెక్స్ గ్లాస్ ప్రైవేటు కంపెనీ వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దాతల సహకారం మరువలేనిది


బోరును ప్రారంభిస్తున్న కౌన్సిల్ చంద్రమౌళి, దాతలు, నాయకులు

చేవెళ్ల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో దాతలు అందించే సహకారం మరువలేనిదని శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ చంద్రమౌళి అన్నారు. మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో గురువారం దాత గున్నాల కృష్ణారెడ్డి తాగునీటి కోసం బోరువేయించగా, సంకేపల్లి నర్సింలు బోర్ మోటార్ అందజేశారు. ఈ బోరును కౌన్సిలర్ చంద్రమౌళి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నీటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. అనంతరం దాతలను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, పాండు రంగారెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి సంజీవరావు, లక్ష్మయ్య, బాబు తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం


మోమిన్‌పేట: మొరంగపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మారెడ్డి



తాండూరు రూరల్: అల్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రచారం

- ప్రజల కోసం పనిచేస్తున్న నేతను గెలిపించుకుందాం
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు
- కొండాకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ప్రచారం..

మోమిన్‌పేట: దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి మొరంగపల్లి, వెల్‌చాల్‌లో పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడారు. దశాబ్ద కాలంగా దేశ ప్రజల కోసం ప్రధాని నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే మరోసారి బీజేపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, నాయకులు రాఘునాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మహేందర్, ప్రతాప్‌రెడ్డి, వెంకట్, బాలరాజ్ తదితరులు ఉన్నారు.

నెరవేరనున్న ఎస్సీ రిజర్వేషన్ కల

తాండూరు రూరల్: మూడు దశాబ్దాల ఎస్సీ రిజర్వేషన్ కల త్వరలో నెరవేర బోతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ, నాయకులు మండల పరిధి అల్లాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మద్దతు తెలిపారని, బీజేపీ ఓటు వేసి మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఇందులో సమితీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ, ఎమ్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ రావత్, నాయకులు ప్రవీణ్, జగదీష్, విజయ్, పరశురాం, ప్రవీణ్, మహేశ్, నరేష్ తదితరులు ఉన్నారు.

మరోసారి ఆశీర్వదించాలి

ధారూరు: ప్రధాని మోదీని మూడోసారి గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. లోకసభ ఎన్నికల్లో భాగంగా మండల పరిధి హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించాలని, అందుకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పాండుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, నాయకులు నెల్లి విశ్వనాథం, సాయిగౌడ్, అనిల్‌గౌడ్, రమేశ్, శివ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత బియ్యం

మర్పల్లి: ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రానుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మండల పరిధి ఘణాపూర్ గ్రామంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. అనంతరం మాట్లాడారు. కరోనా కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. హ్యాట్రిక్ విజయం సాధిస్తే.. మరో ఐదేళ్ల పాటు పేదలకు ఉచిత బియ్యం అందనుందని వెల్లడించారు. దేశం కోసం నిరంతరం పనిచేస్తున్న మోదీని ఆశీర్వదించాలని కోరారు. ఇందులో దామస్తాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, రాజేష్, మండల మహిళామోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు సుభాష్, ఘణాపూర్ బూత్ కమిటీ అధ్యక్షులు రాములు, శేఖర్, జగన్నాథం, కృష్ణ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

విజయం ఖాయం

అనంతగిరి: ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని ఆ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు ఆశాభావం వ్యక్తంచేశారు. గురువారం వారు పట్టణంలో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరుపున ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న మోదీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇందుకు కొండాను గెలిపించి, చేవెళ్లను ప్రధానికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు యాస్కి శిరీష, మాజీ కౌన్సిలర్ సుచరితరెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సతీష్, రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


ధారూరు: చింతకుంట గ్రామంలో బీజేపీ శ్రేణుల ప్రచారం


మర్పల్లి: ఘణాపూర్‌లో..